## క్లుప్తంగా

### పశువులను రోడ్లపై వదిలేస్తే కఠిన చర్యలు

**మణుగూరురూరల్:** పశువులను రోడ్లపై ఇష్టానుసారంగా వదిలేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మణుగూరు పోలీసులు సోమవారం హెచ్చరించారు. దీనివల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుతోందని, ప్రమాదాలు జరిగి పశువులు మృత్యువాతపడుతున్నాయని అన్నారు. పశువుల యజమానులు దీనిని దృష్టిలో ఉంచుకుని తమ సంరక్షణలో వాటిని ఉంచుకోవాలని సూచించారు. లేనిపక్షంలో పశువులను గోశాలకు పంపిస్తామని, యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### విద్యార్థులకు మాత్రల పంపిణీ

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణంలోని గిరిజన గురుకుల కళాశాలలో విద్యార్థులకు కళ్ల కలకకు టాబ్లెట్లను ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి హోమియో వైద్యుడు వెంకటేశ్వర్లు విద్యార్థులకు కళ్ల కలకపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దేవదాసు, రత్నవళి, విజయ్‌కుమార్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రకటించిన నిధులు విడుదల చేయాలి

**భద్రాచలంటౌన్:** భద్రాద్రి అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను, ప్రకటించిన నిధులను వెంటనే విడుదల చేయాలని పట్టణ టీటీడీపీ ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేసీఆర్ రెండు సార్లు అధికారంలోకి వచ్చి ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో కొడాలి శ్రీనివాస్, కంభంపాటి సురేష్, కుంచాల రాజారాం, అభినేని శ్రీనివాసరావు, చంటి, రవితేజ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### నిత్యావసరాలు పంపిణీ

**చండ్రుగొండ:** మండలంలోని మహ్మద్‌నగర్ గ్రామంలో జ్వరబాధితులకు బీఆర్ఎస్‌పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు దారా వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎంపీటీసీ లంకా విజయలక్ష్మి, మెడా మోహన్‌రావు, నల్లమోతు వెంకటనారాయణ, భూపతి రమేష్, సూరా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

**ములకలపల్లి:** ఏజెన్సీ గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయని, వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

గిరిజన ప్రజలు డెంగీ, మలేరియా వంటి జ్వరాలతో మంచానపడుతున్నారని, ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు ఊకంటి రవికుమార్, గడ్డం వెంకటేశ్వర్లు, వీరస్వామి, సారయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### జాయింట్ సర్వే నిర్వహించాలి

**అశ్వాపురం:** మండల పరిధిలోని జగ్గారం రెవెన్యూ గ్రామంలోని 400, 400/2 సర్వే నంబర్లలో భూములను రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వే చేపట్టాలని భారతీయ సర్వ సమాజ్ మహాసంగ్ ఆధ్వర్యంలో గిరిజనులు సోమవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్, డీఎఫ్ఓ ఆదేశించినా స్థానిక అధికారులు సర్వే చేపట్టడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో మండల నాయకులు ఊకె చిట్టెమ్మ, సాయి ప్రవీణ్, సోమలింగం, వెంకన్నతో పాటు గిరిజనులు పాల్గొన్నారు.

### బాధితులకు వితరణ

**దమ్మపేట:** మండలంలోని అల్లిపల్లి గ్రామానికి చెందిన పాండ్ల నందిని అనారోగ్యంతో మృతి చెందగా.. ఆ కుటుంబానికి నాయకపోడు మిత్ర బృందం ఆధ్వర్యంలో బియ్యం, రూ.5వేల నగదును వితరణగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మచ్చల నాగరాజు, యాట్ల మంగారావు, రావుల శోభన్, రవి, శివ, వాసం పోలయ్య పాల్గొన్నారు.

### శివాలయంలో పూజలు

**అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిపించారు. ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అభిషేకాలు, గోత్రనామార్చనలు, అన్నాభిషేకం, దూపదర్శనం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారి పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# భరోసాగా ప్రభుత్వ ఆస్పత్రి

- నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం
- సజావుగా శస్త్రచికిత్సలు
- 250కు పెరిగిన రోజువారి ఓపీ



ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్న స్థానికులు

**మణుగూరురూరల్:** మణుగూరు ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆస్పత్రి ఏజెన్సీ వాసులకు భరోసాగా నిలుస్తోంది. ఏ అనారోగ్య సమస్య వచ్చినా.. గర్భిణులకు అత్యవసర సేవలు అవసరమైనా.. రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందాల్సి వచ్చినా.. వారికి భరోసాగా నిలుస్తోంది. గతంలో మణుగూరు ప్రాంత ప్రజలు మెరుగైన వైద్యం కోసం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రులపైన, సుదూర ప్రాంతాల్లోని పెద్ద, కార్పొరేట్ హాస్పిటల్స్‌పైన ఆధారపడాల్సి వచ్చేది. ప్రస్తుతం ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆస్పత్రిలో మెరుగైన సేవల కోసం చొరవ తీసుకున్నారు. సీఎంతో సంప్రదింపులు జరపడంతో ఏరియా ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. వైద్యనిపుణుల నియామకాలు, అధునాతన పరికరాలు సమకూరాయి. ప్రజలకు 24గంటల వైద్యం అందుబాటులోకి వచ్చింది. దీంతో ప్రతి రోజు సుమారు 250 నుంచి 300 ఓపీ వస్తోంది.

**150కి పైగా శస్త్ర చికిత్సలు..**

మణుగూరు ఏరియా ఆస్పత్రిలో శస్త్ర చికిత్సల్లోనూ కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా సేవలందిస్తున్నారు. ఇప్పటికే 24గంటల కడుపునొప్పి(అప్రెంటిసైటిస్), పేగుకు రంధ్రం, మోకాలి చిప్ప మార్పిడి, ట్రాన్సిలిటైస్ వంటి వాటితో సుమారు 150పైగా శస్త్ర చికిత్సలు చేశారు. వీటిలో ఇటీవల చేసిన మోకాలిచిప్ప మార్పిడి శస్త్రచికిత్సను జిల్లా స్థాయిలో మొట్టమొదటగా నిర్వహించి అరుదైన గౌరవం దక్కించుకుంది. అలాగే మణుగూరు, పరిసర ప్రాంతాలో కొంతమంది డయాలసిస్ పేషెంట్లు ఉండటంతో వారికోసం అధునాతన పరికరాలు ఆస్పత్రికి వచ్చాయి. కాగా, ఇప్పటికీ ఆస్పత్రిలో ఇంకొంత అధునాతన పరికరాలు అందుబాటులోకి రావాల్సి ఉంది. వైద్య నిపుణులను పూర్తి స్థాయిలో నియమించాల్సి ఉంది. కొంతమంది సిబ్బంది రోగుల పట్ల వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణిని మార్చుకోవాల్సి ఉంది.

**ఆస్పత్రి సేవలు మెరుగుపడ్డాయి**

గతంలో వైద్యసేవలు పొందాలంటే ప్రైవేట్ ఆస్పత్రులు, సుదూర ప్రాంతాల ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. మణుగూరు 30 పడకల ఆస్పత్రి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిగా ఏర్పాటై వైద్యసేవలు ప్రారంభమైన దగ్గర నుంచి వైద్య సేవలు మెరుగుపడ్డాయి. సుదూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులు తప్పాయి. అత్యవసరమైతే తప్ప దూర ప్రాంతాలకు వెళ్లడం లేదు.

– వేమూరి వెంకన్న, బాపనకుంట

**కొందరు సిబ్బంది నిర్లక్ష్యం..**

మారుమూల ప్రాంతాల నుంచి మేము వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వస్తాం. ఈ నేపథ్యంలో కొంతమంది సిబ్బంది తమకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. అనారోగ్యాలకు గురయ్యే వారికి దగ్గరుండి చూసుకోవాల్సిన వారే.. నిర్లక్ష్యం వహించడం సరికాదు. రోగుల పట్ల సిబ్బంది మర్యాదగా నడుచుకునే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ప్రసాద్, మణుగూరు

**ప్రజలకు మెరుగైన వైద్యసేవలు**

రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చుతున్న అధునాతన పరికరాలతో మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్సలను సైతం విజయవంతంగా చేయగలుగుతున్నాం. ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం సైతం అందుబాటులో ఉంది. ప్రజలు ఆస్పత్రి సేవలను వినియోగించుకోవాలి.

– డాక్టర్ రాంప్రసాద్, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

# రహదారి వెంట దుర్గంధం



రహదారి వెంట పేరుకుపోయిన చెత్తకుప్ప

**చర్ల:** మండల కేంద్రమైన చర్ల శివారులో వస్తున్న దుర్వాసనతో జనాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి పక్కనే ఇంతగా దుర్వాసన వస్తున్నప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోక పోవడంపై జనం తీవ్రంగా విమర్శిస్తున్నారు. చర్ల నుంచి వెంకటాపురం వైపునకు వెళ్లే ప్రధాన మార్గంలో రహదారి పక్కనే నిత్యం పెద్ద ఎత్తున వ్యర్థాలను వేస్తున్నారు. చర్లలోని మటన్, చికెన్, చేపల దుకాణాల నిర్వాహకులతో పాటు రెస్టారెంట్లు, హోటళ్ల నడిపే వారు వారి షాపుల్లో మిగిలిపోయిన వాటిని బస్తాల్లో వేసి తీసుకెళ్లి ప్రధాన రహదారి పక్కనే వేస్తుండంతో అవి కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఆ ప్రాంతం గుండా రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్రవాహనదారులు, ఆటోలు ఇతర ప్రైవేటు వాహనదారులు ఆ ప్రాంతానికి చేరుకోగానే గుప్పున వచ్చే దుర్వాసనతో వాంతులు చేసుకుంటున్నారు. ప్రధాన రహదారి పక్కనే ఇలా వ్యర్థ పదార్థాలను వేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న వారిపై స్థానిక పంచాయతీ అధికారులు గానీ, పాలకులు గానీ పట్టించుకోకపోవడాన్ని జనం తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఇకనైనా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# వ్యవసాయ క్షేత్రంలోకి విద్యార్థులు



రైతు వేషధారణలో వ్యవసాయ క్షేత్రానికి వెళ్తున్న విద్యార్థులు

**మణుగూరురూరల్:** రైతుల కష్ట, నష్టాలను విద్యార్థులకు తెలపాలనే ఉద్దేశ్యంతో మణుగూరు ఎక్స్‌లెంట్ స్టార్ హైస్కూల్ ఆధ్వర్యంలో సోమవారం వ్యవసాయ క్షేత్ర సందర్శన నిర్వహించారు. విద్యార్థులను అశ్వాపురం మండలం అమ్మగారిపల్లిలోని వ్యవసాయ క్షేత్రంలోకి దింపి వరినాటు విధానాన్ని ఉపాధ్యాయులు ప్రత్యక్షంగా చూపించారు. విద్యార్థులంతా వరినాటు వేస్తూ.. కష్టాని, శ్రమను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ ఎండి.యూసఫ్ షరీఫ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎండి.ఖాదర్, డైరెక్టర్ యాకుబ్ షరీఫ్, ప్రిన్సిపల్ సమీయ నయ్యర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# యూనిఫాం అందించాలి



పాఠశాలలో సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం పట్టణంలోని ఎంపీ కాలనీలోని ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు వెంటనే యూనిఫాం అందించాలని, మిడ్ డే మీల్స్ వర్కర్లకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఎం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఎంపీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని సమస్యలపై వారు సర్వే చేశారు. నాయకులు పాల్గొన్నారు.

# చంద్రబాబు హయాంలో కాల్పులు



భద్రాచలం: సంస్మరణ సభలో నినాదాలు చేస్తున్న నాయకులు

**చర్ల:** 2000 ఆగస్టు 28న హైదరాబాద్‌లోని బషీర్ బాగ్‌లో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకిస్తూ ఆందోళనలో చేపడుతుండగా.. అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దౌర్జన్యం చేసి కాల్పులు జరిపించారు. ఆ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ అమరుల సంస్మరణ సభను సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మచ్చా రామారావు, పామారు ఆలాజీ, సత్రపల్లి సాంబశివరావు, తాళ్లూరి కృష్ణ, శ్రీను, జగదీష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**పోరాటమే అమరులకు నివాళి**

**భద్రాచలంఅర్బన్:** నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువస్తున్న కేంద్ర విద్యుత్ సవరణ చట్టం–2023కు వ్యతిరేకంగా పోరాడటమే బషీర్ బాగ్ అమరవీరులకు తామిచ్చే ఘన నివాళి అని సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు అన్నారు. గడ్డం స్వామి అధ్యక్షతన బషీర్ బాగ్ అమరవీరుల వర్ధంతి సభ సోమవారం జరిగింది. ముందుగా బషీర్ బాగ్ అమరవీరుల చిత్రపటానికి మిడియం బాబురావు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మిడియం మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యుడు ఎం. రేణుక, సున్నం గంగా పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు వై. వెంకట రామారావు, పట్టణ కమిటీ సభ్యుడు భూపేంద్ర, పార్టీ కార్యకర్తలు సతీష్, రవి, నాగమ్మ, శంకర్ పాల్గొన్నారు.

### టెండర్ గడువు పొడిగింపు

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలంలోని ఏరియా వైద్యశాలలో ఉన్న క్యాంటీన్, ఫ్యాన్సీ షాపుల నిర్వహణకు సంబంధించి టెండరు ప్రక్రియను ఈ నెల 31 వరకు పొడిగించినట్లు ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి టెండర్‌దారులు సహకరించాలని ఆయన కోరారు.

### వంట మహిళలకు చీరలు పంపిణీ

**దుమ్ముగూడెం:** మండలంలోని 103 పాఠశాలల్లోని వంట ఏజెన్సీల మహిళలకు ఉచితంగా చీరలను ఎంపీపీ రేసులక్ష్మి, ఎంపీడీఓ ముత్యాలరావు, ఎంఆర్‌జే ప్రభాకర్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ చీరలను హైదరాబాద్‌కు చెందిన శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ వారు పంపించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు, వంట ఏజెన్సీల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పరామర్శ

**దమ్మపేట:** మండలంలోని సరోజనాపురం గ్రామంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దిశెట్టి సత్యప్రసాద్ తండ్రి కోటయ్య, గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా.. భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య సోమవారం ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పొదెం వీరయ్యను కలవడానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో ములకలపల్లి జెడ్పీటీసీ, టీపీసీసీ మెంబర్ సున్నం నాగమణి, కాంగ్రెస్ నాయకులు వగ్గెల పూజ, నల్లపు దుర్గాప్రసాద్, చింతిరాల రవికుమార్, తోట దేవిప్రసన్న, ఏనుగుల అర్జునరావు, మద్దిశెట్టి సత్యప్రసాద్, తుమ్మ రాంబాబు, తాండ్ర ప్రభాకర్‌రావు, వనమా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డే డంపింగ్ యార్డ్



రోడ్డు పక్కన చెత్త వేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది

**మణుగూరురూరల్:** మణుగూరు మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది నిర్వాహకం ముక్కున వేలేసుకునేలా ఉంది. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సఫాయి వాహనాల ద్వారా సేకరించిన చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డ్‌కు తరలించాల్సి ఉండగా.. సదరు సిబ్బంది మాత్రం ప్రధాన రహదారి పక్కనే పారబోశారు. వచ్చిపోయే వాహనదారులకు ఇబ్బందికరంగా మార్చారు. చెత్తను శుభ్రం చేసే వారే తిరిగి చెత్తకుప్పలను పేరుస్తుండడంతో స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డు వెంబడి పారబోసిన చెత్తను తొలగించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

# రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి



ర్యాలీగా ఐటీడీఏకు చేరుకున్న రెండో ఏఎన్ఎంలు

**భద్రాచలంఅర్బన్:** గత 13 రోజులుగా సమ్మె చేస్తున్న రెండో ఏఎన్ఎంలు సోమవారం స్థానిక దీక్షా శిబిరం నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రం అందించారు. స్పందించిన పీఓ.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి బల్ల సాయికుమార్ తెలిపారు. అనంతరం సాయి కుమార్ మాట్లాడారు. బాలనాగమ్మ, వీరభద్రమ్మ, సమ్మక్క, స్వరాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, స్వాతి, పూర్ణ, పద్మ, ముత్తమ్మ, శ్యామల, భూలక్ష్మి, భద్రమ్మ, సరస్వతి, విజయ, సుభద్ర, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్పీ విస్తృత ప్రచారం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

**అశ్వాపురం:** బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ సీఎం అయితేనే బహుజన రాజ్యం సాధ్యమౌతుందని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ నల్లగట్ల రఘు అన్నారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు మణికుమార్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని జగ్గారం, చింతిర్యాల గ్రామ పంచాయతీలో బీఎస్పీ గెలుపునకు ప్రచారం చేస్తూ.. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కోశాధికారి బీ.సతీష్‌యాదవ్, జిల్లా ఈసీ మెంబర్ వెంకటేశ్వర్లు, నియోజకవర్గ కన్వీనర్ ఇసంపల్లి శివకుమార్, మండల నాయకులు నవీన్, శారద, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**దుమ్ముగూడెం:** 'ప్రవీణ్ కుమార్ ఎందుకు సీఎం కావాలి'అనే అంశంపై కరపత్రాలను మండల బీఎస్పీ కన్వీనర్ కంచర్ల సింహాద్రి సోమవారం ఆవిష్కరించారు.

నర్సాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలో పార్టీ సిద్ధాంతాలను, ప్రవీణ్ కుమార్ ఆలోచనలను ప్రజలకు వివరించి చైతన్య పరచాలన్నారు. మండలంలోని ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా బహుజన్ సమాజ్ పార్టీ అండగా ఉండాలని నాయకులకు, పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు సోడి వీరాస్వామి, మండల ఉపాధ్యక్షులు సొంది వెంకట్రాజు, నాయకులు కొప్పుల నారాయణ, కనుకు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# దోమ తెరలు తప్పనిసరిగా వాడాలి



మందు పిచికారీని పర్యవేక్షిస్తున్న డాక్టర్ రాందాస్ నాయక్

**అశ్వారావుపేటరూరల్:** వర్షాకాల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ దోమ తెరలను వినియోగించాలని వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్ సూచించారు. మండలంలోని మలేరియా ప్రభావిత గ్రామాలైన పాతరెడ్డిగూడెం, నారంగుంపు గ్రామాల్లోని 176 గృహాలకు సోమవారం రెండో విడత దోమల నివారణ మందును ఇంటింటికీ స్ప్రేయింగ్ చేయించి పర్యవేక్షించారు. అనంతరం ఆయా గ్రామస్తులకు దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, సిబ్బంది శ్రీనివాస్, విజయరెడ్డి, కృష్ణవేణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**దుమ్ముగూడెం:** గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఏహెచ్ఎస్ నారాయణరావుపేటలో తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల టీచర్లు మధ్యాహ్నం భోజన విరామం సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీడీఏ భద్రాచలం పరిధిలోని కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలు, ఉన్నత పాఠశాల్లో ఇప్పటివరకు పదో తరగతి పాఠాలు బోధించడానికి టీచర్లను సర్దుబాటు చేయలేదని, దీనిపై ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. దీనిపై టెన్త్ బోర్డ్ ఎగ్జామ్‌లో విద్యార్థులపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రతీ స్కూల్లో సబ్జెక్టు టీచర్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో మండల జనరల్ సెక్రెటరీ బి.రవి, నాగభూషణం, శివ, డి.వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ముమ్మరంగా వైద్య శిబిరాలు



దుమ్ముగూడెం: వాగుదాటి వెళ్తున్న వైద్య సిబ్బంది



మణుగూరురూరల్: పరీక్షలు చేస్తున్న సింగరేణి వైద్యులు

**అన్నపురెడ్డిపల్లి:** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక కోరారు. మండల కేంద్రంలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం గ్రామంలో వైద్య సిబ్బంది చేపట్టిన ఇంటింటి ఫీవర్ సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పలు ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడా పద్మ,పంచాయతీ సెక్రటరీ ఖాదర్ , హెచ్ఈఓ కృష్ణయ్య , కోటేశ్వరరావు, చంద్రకాంత, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

**వాగుదాటి వైద్యశిబిరం**

**దుమ్ముగూడెం:** మండలంలోని దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గడ్డమడుగు గ్రామంలో డాక్టర్ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ గ్రామంలోకి వెళ్లేందుకు వాగు అడ్డుగా ఉండటంతో వైద్యసిబ్బంది దానిని దాటుకుని వెళ్లారు. ఈ వైద్యశిబిరంలో 40 మందికి పరీక్షలు నిర్వహించగా వారికి చిరు వ్యాధులు ఉండటంతో మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీళ్లను తాగాలన్నారు. రెండో విడత దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని మారాయిగూడెం గ్రామంలో ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌వి.శ్యామలత, హెచ్ఎస్.సాగర్, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆయుర్వేద వైద్యశిబిరం..**

మండలంలోని సురవరం ఎంపీపీ పాఠశాల, జీపీఎస్ గడ్డోరగట్ట, అంగన్‌వాడీ కేంద్రాలలో పర్ణశాల ఆయుర్వేద డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్యంపై చిన్నారులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులను పరిక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్స్ మోహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

**చండ్రుగొండ:** మండలంలోని మద్దుకూరు గ్రామంలో ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరాలతోపాటు దీర్ఘకాలిక వ్యాధులపై పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, ఏఎన్ఎంలు సుశీల, భవాని, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

**మణుగూరురూరల్:** మండల పరిధిలోని తిర్లాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సింగరేణి సేవా సమితి, వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరైన డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్ ప్రారంభించారు. సింగరేణి వైద్యులు వెంకటరమణ గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి నియంత్రణ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. పలు సూచనలు అందించారు. అనంతరం డీజీఎం(పర్సనల్) మాట్లాడారు. కార్యక్రమంలో ఏరియా పర్యావరణ అధికారి శ్రీనివాసరావు, తిర్లాపురం సర్పంచ్ పాయం కామరాజు, సింగరేణి వైద్యురాలు స్పందన, వార్డ మెంబర్లు శ్యామల, సుజాత, గ్రామస్తులు ఆస్పత్రి వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.